క్లుప్తంగా

నేడు ఆరాధన మహోత్సవం

కొడంగల్: పట్టణంలోని నిరంజన మఠంలో జగద్గురు బసవలింగేశ్వర మహాస్వామి శ్రావణ మాసం ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మఠాధిపతి డాక్టర్ సిద్ధ లింగ మహాస్వామి తెలిపారు. ఉదయం 9 గంటలకు బిల్వార్చన, 10 గంటలకు పల్లకీ సేవ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

ఓటు హక్కు వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై చిత్రాలు గీసిన విద్యార్థినులు

తాండూరు టౌన్: ఓటు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం అని, అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తాండూరు పీపుల్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యానంద్ కోరారు. గురువారం కళాశాలలో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఔన్నత్యాన్ని మార్చే శక్తి యువతకు ఉందని, 18 సంవత్సరాలు ఉండి, ఓటు హక్కులేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాటలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో సభ్యుడికి సన్మానం



రమేష్ మహరాజ్‌తో మండల నాయకులు

యాలాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా ఎన్నికైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్‌ను గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మండల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేనిఫెస్టో సభ్యుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి భారీ మెజారిటీ సాధించడమే తమ లక్ష్యమన్నారు. సన్మానించిన వారిలో పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, అనంతయ్య, రఘురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో కొద్ది రోజులుగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి ఇబ్బంది పడుతున్నామని కాలనీకి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్ అన్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. ఇందులో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు కృష్ణంరాజు, దస్తగిరి, బాల్‌రాజ్, హర్ష, వెంకటయ్య తదితరులు ఉన్నారు.


చెరువుల పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మోమిన్‌పేట: వినాయకులను నిమజ్జనం చేసే మోమిన్‌పేట చెరువును గురువారం అధికారులు పరిశీలించారు. తర్వాత డీజే సౌండ్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా డీజేలను పెట్టరాదని, పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ, తహసీల్దార్, ఎంఆర్‌ఐ, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



కుల్కచర్ల: శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకుని మండల పరిధి సాల్వీడు ఆంజనేయస్వామి దేవాలయంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీటీసీ సంతోష, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య, జిల్లా నాయకుడు బాబయ్య, శ్రీశైలం, ఆలయ కమిటీ సభ్యులు అనంతరాములు, చిన్నయ్య, అంజిలయ్య, లక్ష్మయ్య, రాములు, రామకృష్ణ ఉన్నారు.

పల్లెలను వరించిన అవార్డులు

- అభివృద్ధి పనులకు తగిన గుర్తింపు
- జిల్లా ఉత్తమ పంచాయతీగా దాదాపూర్
- రుద్రారం గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్
- సర్పంచ్‌కు ప్రశంసా పత్రం అందజేసిన కలెక్టర్ నారాయణరెడ్డి



దోమ: సర్పంచ్ కృష్ణకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

దోమ: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డుకు జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా దాదాపూర్ ఎంపిక అయిందని సర్పంచ్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా జీపీ కార్యదర్శి రవీందర్‌రెడ్డితో కలిసి గురువారం కలెక్టరేట్‌లో అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 జీపీలు ఎంపిక కాగా.. అందులో పరిగి మండలం రాఘవాపూర్ జీపీ రాష్ట్ర స్థాయిలో ఎంపిక అయిందని, మిగతా జీపీలు జిల్లా స్థాయిలో ఎంపికయినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు గాను ఈ అవార్డులు వరించాయన్నారు. డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీఓ సోమలింగం, ఏపీఓ దస్తయ్య, ఏపీఎం సురేశ్, ఈసీ చంద్రశేఖర్ ఉన్నారు.

బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా..

కొడంగల్: మండల పరిధి రుద్రారం గ్రామానికి 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు వరించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్వచ్ఛ భారతీ



కొడంగల్: సర్పంచ్ వెంకటలక్ష్మికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్

గ్రామీణ మిషన్‌లో భాగంగా 2022–23 సంవత్సరానికి గాను జిల్లా స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. ఈ మేరకు గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా రుద్రారం సర్పంచ్ పట్లోళ్ల వెంకటలక్ష్మి అవార్డు అందుకున్నారు. ఐదు వేల లోపు జనాభా ఉన్న గ్రామంలో వంద శాతం (ఓడీఎఫ్) బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ఎంపిక అయిందని మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి అవార్డు రావడం సంతోషంగా ఉందని, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు.

రాఘవాపూర్‌కు.. రాష్ట్రస్థాయి



సర్పంచ్, జీపీ కార్యదర్శికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి దయాకర్ రావు

పరిగి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డుకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా పరిగి మండలం రాఘవాపూర్ గ్రామం ఎంపికైంది. దీంతో ఉత్తమ సర్పంచ్‌గా సర్పంచ్ జంగయ్య, ఉత్తమ జీపీ కార్యదర్శిగా సురేష్‌లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

యువతను పట్టించుకోని ప్రభుత్వం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

- ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్న సీఎం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు

పరిగి: నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలపై ఇందిరాపార్క్ వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ.. గురువారం పట్టణ కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం బీజేపీ శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తుంటే.. పోలీసులు ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మేస్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఘనపురం వెంకటయ్య, కిరణ్‌భూనేటి, మిట్టప రమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లిలో..

ప్రజాస్వామ్యం ఖూనీ

మర్పల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధీ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ.. ఆ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బన్నె మల్లేశ్ యాదవ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి శాంతియుతంగా చేస్తున్న దీక్షను భగ్నం చేయడం ప్రభుత్వం కుట్రేనని విమర్శించారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, బలరాంగౌడ్, మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, సుభాష్, మధుకర్, సంతోశ్, జైపాల్, రఘుపతి ఉన్నారు.

ఘనంగా పూజలు

దౌల్తాబాద్: శ్రావణమాస అమవాస్యను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు జరిపారు. పూజతో పాటు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. దౌల్తాబాద్ మండల కేంద్రం బలభీమసేన ఆలయంలో ఆంజనేయస్వామికి పల్లకీసేవ చేశారు.

ముగింపు వేడుకలు

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధి గుండ్లకుంట గ్రామంలో శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి, శివలింగం, బసవేశ్వరుడు, నవగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పల్లకీ సేవతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు పడుతూ దర్శించుకున్నారు.



కొడంగల్ రూరల్: విశేష అలంకరణలో స్వామివారు

దళితబంధు కాదు.. బీఆర్ఎస్‌బంధు

డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఎద్దేవా



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పూడూరు: రాష్ట్ర ప్రభుత్వం దళితుల పేరిట అమలు చేస్తున్న దళితబంధు పథకం.. పూర్తిగా బీఆర్ఎస్ పార్టీ బంధుగా మారిందని డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఆరోపించారు. గురువారం మండల పరిధి రాకంచర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు అర్హులకు అందడం లేదని, ఎవరికీ సమాచారం ఇవ్వకుండా, గ్రామసభలు నిర్వహించకుండా ఎమ్మెల్యే అనుచరులకు, పార్టీ నాయకులకే ఇస్తున్నారని విమర్శించారు. అర్హులైన నిరుపేదలకు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. లేని యెడలా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

క్రికెట్ జోనల్ టీం ఎంపిక

పెద్దేముల్: 2023–24 విద్యా సంవత్సరానికి పెద్దేముల్ జోన్ పరిధి దారూర్, కోట్‌పల్లి, పెద్దేముల్ మండలానికి చెందిన విద్యార్థులను గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ టోర్నీకి జట్టును ఎంపిక చేశామని పెద్దేముల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ జోనల్ సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి చెప్పారు. అండర్–14 నుంచి 16 మంది, అండర్ 17కు 16 మంది విద్యార్థులను క్రికెట్ జోన్‌కు టీంను ఎంపిన చేసినట్లు తెలిపారు. వారిని జిల్లా స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. ఇందులో ఫిజికల్ డైరెక్టర్లు రాధకృష్ణ, లక్ష్మయ్య, పీఈటీలు గోపిక, విజయభాస్కర్, రాజశేఖర్, ప్రశాంత్‌రెడ్డి, మహిపాల్ తదితరులు ఉన్నారు.



క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేస్తున్న కాశీనాథ్

పురుషులతో సమానంగా..

యాలాల: బాలికలు చదువులో రాణించాలని శిక్షణ ఫౌండేషన్ తెలంగాణ రీజినల్ మేనేజర్ కాశీనాథ్ అన్నారు. గురువారం యాలాల మండలం రాస్నం ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హైజిన్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. పురుషులతో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఇందులో హెచ్ఎం గాజుల వీరేశం, ఎస్ఎంసీ చైర్మన్ సంగయ్య, ఉప సర్పంచ్ జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది

దోమ: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యావ్యవస్థ ఉన్నతికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇందులో ఎంఈఓ హరిశ్చందర్ తదితరులు ఉన్నారు.

17న విజయభేరి

కొడంగల్: తుక్కుగూడలో ఆదివారం నిర్వహించనున్న విజయభేరీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ కోరారు. గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ జరగనుందని, కార్యక్రమానికి పార్టీ అగ్రనేత సోనియా గాంధీ వస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నీటి సరఫరాకు అంతరాయం

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఈ నెల 15వ తేదీ వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. బొంరాస్‌పేట మండలం రేగడి మైలారం సమీపంలో పైప్‌లైన్ లీకేజీ వలన సమస్య తలెత్తిందని, మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలివేయడం జరిగిందన్నారు. సర్పంచులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కొడంగల్‌లో భారీ వర్షం

కొడంగల్: కొడంగల్‌లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మురుగు కాల్వలు నిండి చెత్తా చెదారం రోడ్లపైకి వచ్చింది. బస్టాండ్ ప్రాంతంలోని వరద నీరు దుకాణాల్లో చేరి వ్యాపారులకు అసౌకర్యం కలిగించింది.

ఆ శాఖను డివిజన్‌లో కొనసాగించాలి

- ఇప్పటికే సివిల్ సప్లై, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఎక్సైజ్ సీఐ, ట్రెజరీని దూరం చేశారు..
- పంచాయతీ రాజ్ విలీన నిర్ణయం వెనక్కి తీసుకోవాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: మండల పంచాయతీ రాజ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని వికారాబాద్ పంచాయతీ రాజ్ శాఖ డివిజన్ (పీఈఈ) పరిధిలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మండల కేంద్రంలో ఉండాల్సిన సివిల్ సప్లై గోదాం, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఎక్సైజ్ సీఐ, ట్రెజరీ కార్యాలయాలను మోమిన్‌పేట్ మండలానికి తరలించారని, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయాన్ని వికారాబాద్‌లో కొనసాగిస్తున్నారని, ఇప్పుడు పంచాయతీ రాజ్ శాఖ సబ్‌డివిజన్ ఆఫీస్‌ను సైతం తాండూర్‌లో ఏర్పాటు చేసిన పంచాయత్ రాజ్ శాఖ డివిజన్ కార్యాలయంలో విలీనం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. మండలంలో ఆ శాఖ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల బిల్లుల కోసం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లు తాండూర్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మర్పల్లి సబ్‌డివిజన్ కార్యాలయాన్ని వికారాబాద్ డివిజన్‌లోనే కొనసాగేలా చూడాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, బీసీసెల్ జిల్లా నాయకుడు నగేశ్, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు లక్ష్మారెడ్డి, సురేశ్, రాచన్న ఉన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

పెద్దేముల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష గురువారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఉద్యోగుల నిరసనతో మండల కేంద్రంలో విద్యా వనరుల కేంద్రం మూత బడింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్నామని, చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని వాపోయారు. తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించి, క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **'టెట్'కు కట్టుదిట్టమైన బందోబస్తు**

అనంతగిరి: టెట్ (టీచర్ ఎల్జిబులిటీ టెస్ట్) పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 25 టెట్ సెంటర్లు ఉన్నాయని, ఉదయం 5,765 మంది, మధ్యాహ్నం 3,846 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలని సూచించారు.

◆ **పంటల వివరాలు నమోదు చేసుకోవాలి**

కుల్కచర్ల: పంటలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి రైతులకు అవగాహన ఉండాలని పరిగి వ్యవసాయ శాఖ సంచాలకులు(ఏడీఏ) లక్ష్మీకుమారి సూచించారు. గురువారం చౌడాపూర్ మండలం మరికల్‌లో పత్తిపంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

◆ **అర్హులకే దళితబంధు ఇవ్వాలి**

పరిగి: అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా పథకాన్ని అమలు చేయాలని కోరారు.

◆ **జినుగుర్తిలో భజన సమాప్తి**

తాండూరు రూరల్: మండల పరిధి జినుగుర్తిలో శ్రావణమాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నెలరోజుల పాటు గ్రామస్తులు భజనలు నిర్వహించారు. భజన అనంతరం పల్లకీలో స్వామివారిని ఊరేగించారు.

◆ **కార్మికులను పర్మినెంట్ చేయాలి**

వికారాబాద్ అర్బన్: మున్సిపల్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ అధ్యక్షుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేని యెడలా సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వినోద్, నాగేందర్ రెడ్డి, జగదీష్, రాజు ఉన్నారు.

◆ **పెండింగ్ బిల్లులు చెల్లించండి**

దోమ: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని మండల సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, వాటి వడ్డీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. 19 నెలలుగా బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదక వ్యక్తంచేశారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు రాజిరెడ్డి, కేశవులు, యాదయ్య సాగర్, రాజు, నర్సింహులు, వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆలయంలో అన్నదానం**

అనంతగిరి: వికారాబాద్ పట్టణం రాజీవ్ గృహకల్పలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో వార్డు కౌన్సిలర్ మురళి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ ఉన్నారు.



సేవాభావం కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు, సేవాభావం కలిగి ఉండాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా గురువారం కొత్తగంజ్ హనుమాన్ మందిరంలో శివుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. ఇందులో చైర్‌పర్సన్ దంపతులు తదితరులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

◆ **కర్ణాటక వాసుల ఓట్లను తొలగించండి**

తాండూరు టౌన్: కర్ణాటక ప్రాంతంలో నివసిస్తూ తాండూరులో ఓటు కలిగి ఉన్న వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ ఓటు హక్కు కలిగి ఉండి, కర్ణాటకలో స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారు ఎన్నికల సమయంలో ఇక్కడికి వచ్చి ఓటు వేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా వారు కర్ణాటకలోనూ ఓటు హక్కు కలిగి ఉన్నారని విమర్శించారు. ఇలాంటి వారి వలన అన్ని పార్టీలకు ఇబ్బందే అని, సంబంధిత అధికారులు స్పందించి, వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని కోరారు.

◆ **చెక్కు అందజేత**



పెద్దేముల్: పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చర్చ్ ఫాస్టర్ నూతన గృహ నిర్మాణానికి రూ.50వేల చెక్కును అందచేశారు. నిరుపేదలకు తమవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచ్ శ్రావణ్ కుమార్, మండల నాయకులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు ఘనంగా సన్మానం

పెద్దేముల్ మండలం జనగాం పాఠశాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సోమనాథ్‌ను సహ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, పాఠశాల చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గోపీకృష్ణ, మాధవులు, నర్సింహులు, ఇందిర, సమీమ్, రెహానా ఉన్నారు.

◆ **కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్**



దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ వికారబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దౌల్తాబాద్ మండలం బిచ్చాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నర్సింగ్ భాన్‌సింగ్‌ను, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా బోడి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వీరయ్యలను నియమించారు.